క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి

రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న దుకాణదారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్సై పి. నీలావతి సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దుకాణదారులతో సమీక్షించారు. దుకాణాల ముందు అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో వినియోగదారులు, సమీపంలో ఉన్న వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రధాన బీటీ రహదారులపై వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు విసిరేస్తే చట్టపరమైన కేసులు తప్పవన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలో వన్నలి, చాటాయివలస, అంబఖండి, తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది గౌరీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని చెప్పారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ



అంబఖండి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మండలంలోని అంబఖండి గ్రామంలోని 1, 2, 3 కేంద్రాలతో పాటు సోమరాజుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణుల వివరాలపై ఆరా తీశారు. రక్తహీనతతో బాధపడుతున్నవారికి ఆరోగ్య సలహాలు అందించాలని సిబ్బందికి సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బాడంగి: మండలంలో అర్హత కలిగిన లబ్ధిదారులు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త కార్డులతో పాటు సభ్యుల చేర్పులు, తొలగింపులు, కార్డుల విభజన, అడ్రస్ మార్పులు, ఆధార్ సీడింగ్ వంటి సేవలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవసరమైన వారు దరఖాస్తు చసుకోవాలని కోరారు.


బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదుర్గ

వంగర: బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీదుర్గ అన్నారు. మండల పరిధి తలగాం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను, రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిలిచిన పాఠశాల భవనం పనులు



అర్ధంతరంగా నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

రేగిడి: మండల పరిధిలోని కోడిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. తరగతి గదుల నిర్మాణం ఆగిపోవడం వల్ల ప్రాథమిక పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తక్షణమే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కోడిశ గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు.

అడుగుకో గుంత..

- వాహనదారులకు చుక్కలు చూపిస్తున్న ప్రధాన రహదారులు
- సంక్రాంతి ముగిసి నాలుగు నెలలవుతున్నా కానరాని మార్పు
- నియోజకవర్గంలో 80 శాతం రోడ్లు అధ్వానం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్న ప్రజలు



రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డు దుస్థితి, (ఇన్‌సెట్లో) అధ్వానంగా ఉన్న రామభద్రపురం - బాడంగి రోడ్డు

రామభద్రపురం: సంక్రాంతి పండుగ ముగిసి నాలుగు నెలలు పూర్తయ్యాయి. శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి ఇలా వరుసగా పండుగలు ఒకదాని వెంట మరొకటి వచ్చిపోతున్నాయి. క్యాలెండర్‌లో తేదీలు మారిపోతున్నాయి. కానీ రోడ్ల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు కానరావడం లేదు. సంక్రాంతి నాటికి అద్దాల్లాంటి రోడ్లు నిర్మిస్తాం. ఈ దఫా సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చే వాళ్లకు ఇక్కడున్న రోడ్లను చూసి ఆశ్చర్యపోయేలా చేస్తాం అని ప్రగల్భాలు పలికిన పాలకులు కాలం గడుస్తున్నా కిమ్మనడం లేదు. నెలలు దాటుతున్నా.. అవన్నీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో వందల కిలోమీటర్ల రహదారులుండగా.. వాటిలో 70 శాతం రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. వీటిలో కొద్దోగొప్పో మరమ్మతులు చేశారు తప్ప మిగిలినవన్నీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయి. పండుగకు వచ్చిన వాళ్లు రోడ్లను ప్రత్యక్షంగా చూసి అసహనం వ్యక్తంచేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడుతున్నారు.

నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి ఇలా..

నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా తయారైంది. రామభద్రపురం మండలంలో రామభద్రపురం నుంచి బొబ్బిలి.. అలాగే రామభద్రపురం నుంచి బాడంగి.. తెర్లాం మండలంలో తెర్లాం నుంచి బొబ్బిలి.. బాడంగి మండలంలో పినపెంకి నుంచి ఆకులకట్ట.. బొబ్బిలి మున్సిపల్ పరిధిలో మరికొన్ని రోడ్లు శిథిలావస్థకు చేరి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు ప్రయాణాలు చేసేందుకు నరకయాతన పడుతున్నారు. రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో రూ.166.7 లక్షలతో 34.605 కిలో మీటర్ల రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. వీటిలో కూడా సగం పనులు మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో గల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు రూ. 164.25 లక్షలతో 47.037 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపడుతుండగా.. వీటిలో 29.137 కిలోమీటర్ల పనులు పూర్తవ్వగా ఇంకా 17.9 కిలో మీటర్ల పనులు మిగిలిపోయాయి. రామభద్రాపురం మండలంలోని రామభద్రపురం – రాజాం వెళ్లే రహదారితో పాటు రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారి అధ్వానంగా మారాయి. ఈ రహదారులు మీదుగా రోజుకు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..

రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారి.. రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే రహదారులపై అడుగుకో గుంత ఏర్పడ్డాయి. దీంతో రోజుకు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన పాలకులు.. ఇదిగో అదిగో అంటున్న అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లు బాగు చేయాలి.

– చొక్కాపు రామలింగేశ్వరరావు, రామభద్రపురం

రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి..

రామభద్రపురం నుంచి బొబ్బిలి.. తెర్లాం నుంచి బొబ్బిలి.. రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే స్టేట్ హైవేలకు సుమారు రూ.4.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు కూడా మంజూరయ్యాయి. టెండర్లు ఖరారైన వెంటనే మరమ్మతులు చేపడతాం.

– ప్రణయ, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, బొబ్బిలి

అన్నదానం..



అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వావిలవలస గ్రామానికి చెందిన శ్రీరామ ధర్మక్షేత్రం పీఠాధిపతి వారణాశి జగన్నాథస్వామి అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో వృద్ధులు, పేదలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. – రేగిడి

దేవాలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాలకు నోటిఫికేషన్

రాజాం సిటీ: జిల్లాలోని పలు దేవాలయాలకు ట్రస్టుబోర్డు నియామకాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పోలిపల్లి పైడితల్లి ఆలయ ఈఓ బీవీ మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాంతో పాటు జిల్లాలోని 18 దేవాలయాలకు సంబంధించి ట్రస్టుబోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజాం నియోజకవర్గంలో ఐదు దేవాలయాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. డోలపేట ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, నవదుర్గ ఆలయం, పోలిపల్లి పైడితల్లి ఆలయం, సంగాంలోని సంగమేశ్వర ఆలయం, సంతకవిటిలోని గుళ్లసీతారాంపురంలోని సీతారామ ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. అలాగే బొబ్బిలిలో వేణుగోపాలస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, పాత బొబ్బిలి ఆంజనేయ స్వామి ఆలయం, చీపురుపల్లిలో నీలకంఠేశ్వర స్వామి ఆలయం, భోగాపురం మండలం పోలిపల్లిలో పైడితల్లి అమ్మవారి ఆలయం, పూసపాటిరేగ మండలం కుమిలిలో గణపతి ఆలయం, ఎల్.కోట మండలంలో శ్రీరామ్‌పురంలో సీతారామస్వామి ఆలయం, విజయనగరంలోని సంతపేట జగన్నాథస్వామి ఆలయం, కొత్త అగ్రహారంలో సీతారామస్వామి ఆలయం, బాలాజీనగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయం, అయ్యకోనేరుగట్టులో పెద్దాంజనేయస్వామి ఆలయం, విజయనగరంలో ఉమారామలింగేశ్వర ఆలయాల్లో ట్రస్టుబోర్డులు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలయ్యిందని పేర్కొన్నారు. వార్షిక ఆదాయానికి అనుగుణంగా సభ్యులు నియామకం జరగనుందని తెలిపారు.



రెండో అర్చకుడిగా శ్రీనివాస్‌శర్మకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఈఓ మాధవరావు

రెండో అర్చకుడు నియామకం.....

స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయానికి రెండో అర్చకుడిని నియమించారు. జాడ శ్రీనివాసరావు శర్మను నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారని ఈఓ మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సూర్యనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, వెంపల లక్ష్మణరావు, శిమ్మ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నం

సంతకవిటి: మండలంలోని జీఎస్ పురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీ రత్నం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

కూనాయవలసలో..

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామ సచివాలయంలో కూనాయవలస, జన్నివలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు పలు అంశాలపై కార్యకర్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడెల విజయబాబు, సచివాలయ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వయోవృద్ధులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఫిజీషియన్స్, రాజకీయేతర సభ్యులు, సేవాదృక్పథం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రీ సంఘ సభ్యులు, ఇతర స్వయంసహాయక సంఘ సభ్యులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేయదలచిన వారు పదో తరగతి అర్హతతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 14 లోగా కోర్టు సముదాయంలో సంప్రదించాలని సూచించారు. పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి పారితోషికం ఉండదని తెలిపారు.

12 నుంచి వాడాడ గ్రామదేవత పండుగ

బాడంగి: మండలంలోని వాడాడ పైడితల్లి అమ్మవారి పండుగను ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సర్పంచ్ పూడి తిరుపతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరగనున్న మరిడిమాంబ ఉత్సవాలతో ఈ పండుగ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమాను, ఘటాల తిరువీధి, బుధవారం అనుపోత్సవం ఉంటుందన్నారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి రూరల్: ఈ నెల 12, 13 తేదీల్లో మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పోతుల రవికిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 12,13 తేదీల్లో మండలంలోని జగన్నాథపురం, చింతాడ గ్రామాల్లో.. 14, 15 తేదీల్లో దిబ్బగుడివలస, సీహెచ్ బొడ్డవలస గ్రామాల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ శాఖ నుంచి సహకారం కరువు..

- సీఐ నారాయణరావు

రామభద్రపురం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ శాఖ సహకరించడం లేదని సీఐ కె. నారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆక్రమణలకు పాల్పడిన ఇంటి యజమానులు, దుకాణదారులకు రెవెన్యూశాఖ నోటీసులు ఇవ్వాలని.. వారు ఇవ్వకపోవడంతో ఆక్రమణలు తొలగించలేకపోతున్నామని చెప్పారు. ఆక్రమణలు తొలగించకపోవడం వల్లే ట్రాఫిక్ సమస్య తెలెత్తి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల సమయంలో రెవెన్యూ సిబ్బంది అవసరం ఉంటుందని.. ఆయా సమయాల్లో వారి నుంచి సహకారం ఉండడం లేదని చెప్పారు. రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహరించినప్పుడే శాంతిభద్రతలను పరిరక్షించగలమన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వి. ప్రసాదరావు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

పాలకులకు ప్రజా సమస్యలపై శ్రద్ధ లేదు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో రెడ్ బుక్ పాలనపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా కూటమి నాయకులకు లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రెడ్‌బుక్ పాలనలో భాగంగా పవిత్రమైన జర్నలిజం వృత్తిలో ఉన్నవారిని కూడా వదలడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇలాంటి పనికిరాని ఆరాచకాలకు పాల్పడుతున్నారన్నారు

అరాచక పాలనలో సఫలం..

కూటమి ప్రభుత్వం అరాచక పాలనలో సఫలమైందని..దేశానికి వెన్నెముకగా ఉన్న అన్నదాతలను ఆదుకోవడంలో విఫలమైందని శంబంగి ఆరోపించారు. పలుమార్లు మంత్రివర్గ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా.. కనీసం రైతుల గురించి ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రైతులు కష్టపడి పండించిన ఉద్యాన పంటలకు కనీస మద్దతు ధర లేకుండా పోయిందన్నారున. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుభరోసా, ఉచిత పంటల బీమా, తదితర పథకాలు ఎత్తేయడంతో రైతులకు ఎలాంటి నష్టపరిహారం మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు లేక అవస్థలు

రేగిడి: మండల పరిధిలోని కొర్లవలస – పనసలవలస గ్రామాల మధ్య రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పనసలవలస, కొర్లవలస గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకువచ్చారు. కొర్లవలస జంక్షన్ నుంచి పరశురాంపేట రహదారి నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సమస్య వివరించగా..వచ్చే విడతలో రోడ్డు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కడగల నాగరాజు, గేదెల సత్తిబాబు, బంకి గణేష్, కిమిడి అశోక్‌కుమార్, గురవాన ధనుంజయ్, వావిలపల్లి నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను విన్నవిస్తున్న పనసలవలస గ్రామస్తులు

సచివాలయం తనిఖీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీఓ ఎం. కిరణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, రేషన్ కార్డుల దరఖాస్తులు, గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారుల రికార్డులు పరిశీలించారు. అలాగే మెడికల్ సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. వైద్యసేవలు ఎలా అందుతున్నదీ ఆరా తీశారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నానేశ్వరి, ఎంపీడీఓ పోతుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఎం. కిరణ్‌కుమార్

నేడు ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి: మండల కేంద్రంలోని కళింగ వైశ్య భవనంలో బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్, విశాఖపట్నం ఒమేగా హాస్పిటల్ సౌజన్యంతో శనివారం మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు, క్లబ్ అధ్యక్షుడు సిందిరి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రముఖ ప్రసూతి వైద్యులు పి. రామ్‌కుమార్, ఎ. శ్రావణి వైద్య సేవలు అందిస్తారన్నారు. వీటితో పాటు అవసరమైన వారికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరం ఉదయం 9.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బొబ్బిలి పరిసర ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

- డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: క్షణం తీరిక లేకుండా గడిపే ప్రజలకు దైనందిన జీవితంతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా అవసరమని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. పుట్టపర్తి నుంచి వచ్చిన సాయి ప్రేమరథం శుక్రవారం బొబ్బిలి చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక సత్యసాయి మందిరాన్ని రంగవల్లికలతో అలంకరించారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీమతి భవ్యారెడ్డి జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. ఊరేగింపులో సత్యసాయి సంస్థల జిల్లా ప్రతినిధులు, స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బేతనపల్లి లక్ష్మణరావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

బొబ్బిలి రూరల్: సత్యసాయి ప్రేమరథాన్ని మండలంలోని పిరిడి, పట్టణ పరిసరాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

విజయరాంపురంలో ..

తెర్లాం: భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా తెర్లాం మండలంలోని విజయరాంపురం (బూరిపేట) గ్రామంలో సత్యసాయి ప్రేమ రథాన్ని ఊరేగించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బొత్స అప్పలస్వామినాయుడు మాస్టారు జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధికంగా పాల్గొని సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరి మధుసూదనరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బొబ్బిలి: సత్యసాయి రథాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి



తెర్లాం: రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి కన్వీనర్ అప్పలస్వామినాయుడు